# కాంగ్రెస్‌కు అధికారమిస్తే కర్ణాటక గతే

- విద్యుత్ కోతలతో రైతులు నరకయాతన
- తెలంగాణలో నీళ్లు, విద్యుత్‌కు కొదవ లేదు
- ధర్మపురి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్
- ప్రజా ఆశీర్వాద యాత్రకు నీరాజనం



ధోమలకుంట ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న ధర్మపురి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

పెగడపల్లి, అక్టోబర్ 27: కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే, ప్రస్తుతం ఆ పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటక గతే మనకు పడుతుందని ధర్మపురి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన ఐదు నెలలకే ఆగమాగం అవుతోందని, విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర నరక యాతన పడుతున్నారని వాపోయారు. అదే తెలంగాణలో విద్యుత్, నీళ్లకు కొదవ లేదని గుర్తు చేశారు. శుక్రవారం మండలంలోని ఆరవల్లి, ధోమలకుంట, సుద్దపల్లి గ్రామాల్లో ధర్మపురి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజా ఆశీర్వాద యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆరవల్లిలో నాయకురాలు దేవత ఆలయంలో మంత్రి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మూడు గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర చేపట్టి ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో మంత్రి ఈశ్వర్ మాట్లాడారు. అరవై ఏండ్ల కాంగ్రెస్ పాలనలో నీళ్లు, విద్యుత్, విద్య, వైద్యం లేక ప్రజలు నానా కష్టాలు పడ్డారని, అప్పుడు ఏమాత్రం పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇపుడు తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ వాటిని అమలు చేస్తుంటే, కళ్ల బొళ్లి హామీలు గుప్పిస్తూ, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వీటిని ఎవరూ నమ్మే స్థితిలో లేరన్నారు. రైతులకు 3 గంటల కరెంట్ చాలని రేవంత్‌రెడ్డి అంటుండగా, ఇప్పుడు అదే పార్టీ సీనియర్ నేత ఉత్తమ్‌కుమార్ రెడ్డి రైతుబంధు సాయం దండగని పేర్కొనడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే, రాష్ట్రం అధోగతి పాలవుతుందని, ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పదేండ్లలో ఆరవల్లి, ధోమలకుంట, సుద్దపల్లి గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. ఆరవల్లిలో అతి పురాతన కాలానికి చెందిన, మూత పద్ద వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధికి ఎన్నికలయ్యాక ₹25 లక్షల నిధులు మంజూరు చేస్తానని కొప్పుల ఈశ్వర్ హామీ ఇచ్చారు. పదేండ్ల సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధించిందని, రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మూడు గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీకి చెందిన పలువురు నాయకులు మంత్రి ఈశ్వర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కాసుగంటి రాజేందర్‌రావు, ఎంపీపీ గోళి శోభా సురేందర్‌రెడ్డి, సర్పంచులు ఉప్పలంచ లక్ష్మణ్, బాల్సాని నిహారికాశ్రీనివాస్, నేరెళ్ల హరికాగంగాధర్, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు లోక మల్లారెడ్డి, బండి వెంకన్న, నంచర్ల విండో చైర్మన్ మంత్రి వేణుగోపాల్, వైస్ ఎంపీపీ గాజుల గంగాధర్, ఆర్బీఎస్ మండలాధ్యక్షుడు ఉపుగండ్ల నరేందర్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ రాజు ఆంజనేయులు, కో-ఆప్షన్ సభ్యుడు రహీం, మండల అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడు ఇరుగురాల ఆనందం, ఉపాధ్యక్షుడు మాదారపు కరుణాకర్‌రావు, యూత్ అధ్యక్షుడు సంతోష్, మహిళా అధ్యక్షురాలు మమత, నాయకులు అన్నెమల్ల కాంతయ్య, తిర్మణి నర్సింహారెడ్డి, రమణారెడ్డి, చంద్రమౌళి, శ్రీనివాస్, మహేశ్, గాలిపెల్లి సత్తయ్య, శోభన్‌బాబు, బాబురావు, రాజశేఖర్ గౌడ్, విజయ్‌యాదవ్, తిరుపతి, సాగర్, జానీ, సంజీవరెడ్డి ఉన్నారు.



గిరిజనుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రమణ, పక్కన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

# స్వరాష్ట్రంలోనే గిరిజనుల అభివృద్ధి

- జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్
- గిరిజన బంధుకు బీఆర్ఎస్ కట్టుబడి ఉంది
- ఎమ్మెల్సీ ఎల్. రమణ
- జిల్లా కేంద్రంలో గిరిజనుల ఆత్మీయ సమ్మేళనం

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 27: 60 ఏండ్లు నిరాదరణకు గురైన గిరిజనులు బీఆర్ఎస్ తొమ్మిదేండ్ల పాలనలో సర్వతోముఖాభివృద్ధి చెందారని, ఏండ్లుగా నోచుకోని పోడు భూములకు గిరిజనులను పట్టాదారులుగా చేశామని జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల నియోజకవర్గ గిరిజన ఆత్మీయ సమ్మేళనాన్ని జిల్లా కేంద్రంలోని బూసి లక్ష్మీనారాయణ గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్. రమణ, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజేశం గౌడ్ హాజరయ్యారు. కాగా కొమురం భీం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడారు. విద్యతోనే వికాసం అనే సూక్తికి అనుగుణంగా గిరిజనులకు నాణ్యమైన విద్యనందించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన గురుకులాలను స్థాపించారన్నారు. సమైక్య పాలనలో రాష్ట్రంలో ఎస్టీలకు 91 పాఠశాలలు మాత్రమే ఉండగా, తెలంగాణ ఏర్పాటు తర్వాత 70 గిరిజన పాఠశాలలు ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణకు ముందు గిరిజన పాఠశాలల్లో 1147మంది ఉపాధ్యాయులు, 30వేల మంది విద్యార్థులు మాత్రమే ఉండేవారన్నారు. తొమ్మిదేండ్లలో గిరిజన పాఠశాలలను 161కు చేర్చి 3200 మంది ఉపాధ్యాయులను నియమించామని, 60వేలకు పైగా గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. విద్య, ఉద్యోగ రంగాల్లో గిరిజనులకు పది శాతం రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత ఒక్క బీఆర్ఎస్‌కే దక్కిందని పేర్కొన్నారు. ఎన్నో ఏండ్లుగా ఉన్న పోడు భూములను గిరిజనులకు పట్టాలిచ్చి భూయజమానులుగా చేసి రైతుబంధు సైతం వర్తింపజేశామన్నారు. అదేవిధంగా తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనులే పాలించుకునేలా చేశామన్నారు. మరో సారి అవకాశమిస్తే గిరిజన గ్రామాలను, తండాలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎల్. రమణ మాట్లాడారు. గిరిజన తండాలకు తాగు నీటి వసతి లేక మహిళలు కిలోమీటర్ల కొద్ది బిందెలతో నీళ్లు తెచ్చుకునే వారని గుర్తు చేశారు. కానీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా గిరిజన గ్రామాలు, తండాల్లో తాగు నీటి కష్టాలు తప్పాయని హర్షం వ్యక్తం చేశారు. పోడు భూములు ఉన్న గ్రామాల్లో సర్పంచులు తీర్మానాలు చేసి తనకు నివేదిస్తే రానున్న కాలంలో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే గిరిజన బంధును కూడా అమలు చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఫైనాన్స్ కమిషన్ మాజీ చైర్మన్ రాజేశంగౌడ్, రాయికల్ ఎంపీపీ లావుడ్య సంధ్యారాణిసురేందర్‌నాయక్, జడ్పీటీసీ జాదవ్ అశ్విని, సారంగాపూర్ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎంపీటీసీలు భూక్య లాల్యా, పెండెం కవిత, సర్పంచులు యమునరవి, అరుణ, స్వప్నాసాగర్, ప్రభాకర్, చిత్రం మారుతి, విజయ్ బీర్యాల్, ఉప సర్పంచ్‌లు గంగాధర్, ప్రభాకర్, ఏఎంసీ డైరెక్టర్ సుభవత్ రాజన్న, రమణ, పాల్గొన్నారు.

# అర్వింద్ ఏం ముఖం పెట్టుకుని వస్తుండు

- ఎంపీగా నియోజకవర్గానికి ఏమైనా చేసిండా?
- కాంగ్రెస్ తెలంగాణకు చేసిందేమీ లేదు
- కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- ఎమ్మెల్యేతో కలిసి గ్రామాల్లో ప్రచారం



డబ్బ గ్రామంలో బీఆర్ఎస్‌లో చేరిన మహిళలతో సంజయ్ కల్వకుంట్ల

ఇబ్రహీంపట్నం, అక్టోబర్,27 : అరవై ఏండ్ల పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో మోసపోయిందని, తెలంగాణకు చేసిందేమీ లేదని కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల అన్నారు. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని ప్రతిపక్షాలు మీ వద్దకు వచ్చి మాయమాటలు చెబుతూ మిమ్మల్ని ఆగం చేయాలని చూస్తున్నారన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో కలిసి మండలంలోని అమ్మక్కపేట, డబ్బ, వర్షకొండ, కోమటి కొండాపూర్‌లో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అర్వింద్ ఎంపీగా గెలిచిన తర్వాత నియోజకవర్గంలో ఏ ఒక్క పని అయిన చేశాడా..? ఆలోచించాలని, ఏం ముఖం పెట్టుకొని కోరుట్లలో ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు వస్తున్నాడని అన్నారు. కులాలు, మతాల పేరుతో రెచ్చగొట్టడమే కానీ, అభివృద్ధి చేసిందేమీ లేదని పేర్కొన్నారు. జువ్వాడి నర్సింగరావు కూడా నియోజకవర్గానికి చేసిందేమీ లేదని ఎన్నికలు రాగానే నియోజకవర్గంలో తిరుగుతూ ప్రజలను ఆగం చేస్తున్నారని, ప్రజలు ఆగం కావద్దని, పనిచేసే ప్రభుత్వాన్ని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. కల్వకుంట్ల కవిత ఎంపీగా ఉన్నప్పుడు ప్రతి గ్రామానికి నిధులను వెచ్చించి అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ ఓటర్లను కేసీఆర్ అందిస్తున్న పథకాలు, మ్యానిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. అంతకు ముందు ఆయా గ్రామాల్లో ప్రజలు, మహిళలు మంగళహారతులు, డప్పు చప్పుళ్లతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుకు ఘన స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, జడ్పీటీసీ కంతం భారతి, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు పొన్‌కంటి వెంకట్, సర్పంచులు సుద్దాల దివ్యవాణి, లింగంపెల్లి గంగాధర్, దొంతుల శ్యామల, కొప్పెల శ్రీనివాస్, ఎంపీటీసీలు గుగ్గావత్ లక్ష్మి, జలేశ్, నాయకులు సత్యనారాయణ, జగన్‌రావు, రమేశ్, చిన్నారెడ్డి, రాజన్న, తుక్కారాం, సురేష్‌రెడ్డి, జీవన్, రెబ్బటి రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

**ముదిరాజ్, రజక సంఘ సభ్యుల తీర్మానం**

సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితులై అమ్మక్కపేటలోని ముదిరాజ్ సంఘ సభ్యులు, డబ్బాలో రజక సంఘ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేసి బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్లను గెలిపించుకుంటామని డాక్టర్ సంజయ్ కల్వకుంట్లకు అందించారు. కాగా రజక సంఘ సభ్యులు ఎన్నికల ప్రచారం కోసం రూ.5వేలు డాక్టర్ సంజయ్ కల్వకుంట్లకు అందించారు. 150 మంది పప్పీ, ఆదర్శ యూత్ మహిళలు డబ్బ సర్పంచ్ గంగాధర్ ఆధ్వర్యంలో, వర్షకొండలో 50మంది యువకులు సర్పంచ్, ఎంపీటీసీ ఆధ్వర్యంలో అలాగే కోమటి కొండాపూర్ సర్పంచ్ కొప్పుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ నుంచి పది మంది బీఆర్ఎస్‌లో చేరారు. డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల వారికి పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు.

**సంజయ్‌ను భారీ మెజార్టీతో గెలిపించండి**

**- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు**

తనను ఆదరించి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. తనను ఆదరించినట్లుగానే తన తనయుడు డాక్టర్ సంజయ్ కల్వకుంట్లను ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తన కొడుకు మంచి డాక్టర్ అని, ఆ వృత్తిని వదిలి మీకు సేవ చేయడానికి వస్తున్నాడని, ప్రజలు ఆశీర్వదించి మరింత అభివృద్ధికి సహకరించాలన్నారు. యువతకు అండగా నిలిచి స్వయం ఉపాధికి వెన్నంటే నిలుస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు ఐటీ ద్వారా ఉద్యోగ అవకాశాల కోసం కృషి చేస్తున్నాడన్నారు.

# అమరుల త్యాగాలను స్మరించుకోవాలి

- వారి జ్ఞాపకార్థమే పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహణ
- జిల్లా ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్
- జిల్లా కేంద్రంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు
- రక్తదానం చేసిన 300 మంది సిబ్బంది

జగిత్యాల, అక్టోబర్ 27: విధి నిర్వహణలో కర్తవ్యమే లక్ష్యంగా ప్రాణత్యాగం చేసి అమరులైన పోలీసులను ఈ సమాజం ఎప్పటికీ మరువదని ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ అన్నారు. వారి త్యాగాలను స్మరించుకోవాలన్నారు. అమరుల జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల (ఫ్లాగ్ డే) సందర్భంగా శుక్రవారం విరూపాక్షి ఫంక్షన్ హాల్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోలీస్ అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులను స్మరిస్తూ మౌనం పాటించారు. అనంతరం ఎస్పీ ప్రీత్‌సింగ్ మాట్లాడారు. ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడుతూ సంఘ విద్రోహశక్తుల చేతుల్లో బలైన అమరులైన పోలీసు వీరులను స్మరించుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని తెలిపారు. రక్తదానం ఏర్పాటు చేసిన జగిత్యాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీతో పాటుగా కరీంనగర్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది, స్థానిక బ్లడ్ బ్యాంక్ వైద్యులు, సిబ్బంది సహకారానికి ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం ప్రాణదానంగా నిలుస్తుందని తెలిపారు. సుమారు 300 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది, బీఎస్ఎఫ్ సిబ్బంది, యువకులు రక్తదానం చేశారు. ఎక్కువ సార్లు రక్తదానం చేసిన ఏఎస్ఐ చంద్రశేఖర్, యువకులను అభినందించి సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో అడిషనల్ ఎస్పీలు ప్రభాకర్‌రావు, భీంరావ్, డీఎస్పీలు రవీంద్ర కుమార్, వెంకటస్వామి, ఇన్‌స్పెక్టర్లు నటేశ్, కోటేశ్వర్, రమణమూర్తి, ఆరిఫ్ అలీఖాన్, ఆర్ఐలు వేణు, రామకృష్ణ, జనిమియా, ఎస్ఐలు, జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ మంచాల కృష్ణ, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్, పోలీస్, బీఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎస్పీ